క్లుప్తంగా

కాంగ్రెస్‌లో చేరిక



పార్టీలో చేరుతున్న నేతలు

తుక్కుగూడ : మున్సిపాలిటీ పరిధిలోని మంఖాల్, రావిర్యాల గ్రామాలకు చెందిన ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు శనివారం కాంగ్రెస్ పార్టీలో కేఎల్ఆర్ సమక్షంలో చేరారు. వారికి ఆయన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రచారానికి రండి



కవితను ఆహ్వానిస్తున్న నేతలు

హుడాకాంప్లెక్స్: ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను సరూర్‌నగర్ డివిజన్ సీనియర్ మైనార్టీ ఉద్యమ నాయకులు మహ్మద్ సలీం శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. డివిజన్‌లో చేపట్టిన ఎన్నికల ప్రచారానికి రావాలని ఆహ్వానించారు. దీపావళి పండుగ తర్వాత సరూర్‌నగర్ ప్రచారానికి రావడానికి కవిత అంగీకరించినట్లు సలీం తెలిపారు.

బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా శ్యాంసుందర్

మీర్‌పేట: బీజేపీ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యుడిగా మీర్‌పేట కార్పొరేషన్ న్యూ బాలాజీనగర్‌కు చెందిన కర్రె శ్యాంసుందర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా శనివారం జిల్లా పార్టీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి నియామక పత్రం అందజేశారు. అనంతరం శ్యాం సుందర్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో పదవిని అప్పగించిన పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఎన్నికల్లో బీజేపీ మహేశ్వరం అభ్యర్థి విజయానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

సబితకు మద్దతుగా ప్రచారం



ప్రచారం చేస్తున్న మాజీ ఎంపీపీ తదితరులు

కందుకూరు: మండల పరిధిలోని దాసర్లపల్లి, పెద్దమ్మతండా, మాన్యగూడ గ్రామాల్లో శనివారం బీఆర్ఎస్ అభ్యర్థి సబితారెడ్డికి మద్దతుగా మాజీ ఎంపీపీ శోభాఈశ్వర్‌గౌడ్ ప్రచారం చేపట్టారు. ఆమె వెంట మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

లార్డ్స్ విద్యార్థుల జయకేతనం



విద్యార్థులతో లార్డ్స్ యాజమాన్యం

బడంగ్‌పేట్: గచ్చిబౌలి స్టేడియంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఎస్ఎఫ్ఏ(స్పోర్ట్స్ ఫర్ ఆల్)లో బడంగ్‌పేటలోని లార్డ్స్ ఒలంపియాడ్ విద్యార్థులు కబడ్డీ విభాగంలో పాల్గొని రెండో స్థానంలో నిలిచి సత్తాచాటారు. ఈ సందర్భంగా శనివారం లార్డ్స్ విద్యాసంస్థల చైర్మన్ సిద్దాల బీరప్ప, వైస్ చైర్మన్ బి.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రం నలుమూలల నుంచి ఎన్నో పాఠశాలల నుంచి ఎస్ఎఫ్ఏ పోటీలో పాల్గొనగా లార్డ్స్ విద్యార్థులు రన్నరఫ్‌గా నిలవడం చాలా సంతోషమన్నారు. అనంతరం విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో డీన్ సతీష్‌కుమార్, ప్రిన్సిపాల్ రామిడి సంతోష్, బానూరు శ్రీనివాస్‌రెడ్డి, ఇన్‌చార్జి రేఖాసాగర్ తదితరులున్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

ఫిల్మ్ సెన్సార్ బోర్డు మెంబర్ కృష్ణాదిశేషు పెంటపాటి

వనస్థలిపురం: రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు బలమైన ఆయుధం... దానిని సద్వినియోగం చేసుకోవడం మన విధి అని సెంట్రల్ ఫిల్మ్ సెన్సార్ బోర్డు మెంబర్, సామాజికవేత్త కృష్ణాదిశేషు పెంటపాటి అన్నారు. సమాజం, రాష్ట్ర, దేశ భవిష్యత్ బాగుండాలని కోరుకునే ప్రజలకు ఇది ఒక సువర్ణ అవకాశమన్నారు. ఓటర్లు ఓటు వేసే ముందు విచక్షణతో విశ్లేషించి నిర్ణయం తీసుకోవాలి. తాత్కాలికమైన తాయిలాలకు ఆశపడకుండా, కుల, మతాలకు అతీతంగా, ప్రజల అవసరాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం గల నాయకులను ఎన్నుకోవాలని ఆయన సూచించారు.

మరోసారి గెలిపించండి

- బాధ్యతగా సేవచేస్తా
- మంత్రి సబితారెడ్డి



మంత్రి సబిత సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ నేతలు

దిల్‌సుఖ్‌నగర్: సీఎం కేసీఆర్‌ది ప్రజల ప్రభుత్వమని విద్యాశాఖ మంత్రి, బీఆర్ఎస్ మహేశ్వరం అభ్యర్థి సబితారెడ్డి అన్నారు. ఆర్‌కేపురం డివిజన్ ఫేజ్– 2, 3లకు చెందిన బీజేపీ డివిజన్ వైస్ ప్రెసిడెంట్ మహేందర్, కుమార్, కృష్ణ, సోములు తమ అనుచరులతో కలిసి శనివారం మంత్రి సమక్షంలో గులాబీ పార్టీలో చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అభివృద్ధికి కేరాఫ్ అయిన బీఆర్ఎస్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో దేశంలోనే నంబర్ వన్ స్థానంలో నిలిచిందన్నారు. సంక్షేమం కావాలా.. సంక్షోభం కావాలా..? అని ప్రశ్నించారు. సామాన్యుల అభ్యున్నతి లక్ష్యంగా, ప్రజలందరూ సమానంగా ఎదగాలనే లక్ష్యంతో కేసీఆర్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. మీ కోసం మీలో ఒకరిగా, ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి బాధ్యతగా పనిచేస్తానని, మరోసారి ఆశీర్వదించి, గెలిపించాలని కోరారు. ఆయా కాలనీల నేతలు మాట్లాడుతూ.. మహేశ్వరం అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న సబితారెడ్డి గెలుపే ధ్యేయంగా పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ ప్రధాన కార్యదర్శి అరవింద్‌శర్మ, డివిజన్ అధ్యక్షుడు నగేష్, సీనియర్ నాయకులు సాజిత్, శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, శ్యామ్‌గుప్తా, రామాచారి తదితరులు పాల్గొన్నారు.

స్థానికుడికే పట్టం కట్టండి



బడంగ్‌పేట్: అల్మాస్‌గూడలో మాట్లాడుతున్న శ్రీరాములు



కందుకూరు: అందెల సమక్షంలో బీజేపీలో చేరుతున్న నేతలు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడలో మహేశ్వరం నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్ రోడ్ షో, పాదయాత్రతో ఓటర్లను కలుస్తూ కమలం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. బడంగ్‌పేట కార్పొరేషన్‌లో ఇంటి పన్నులు, నల్లాబిల్లులు ఎక్కువ అన్నారు. చెరువులు పార్కులు కబ్జాలు చేసింది మంత్రి సబితారెడ్డి అనుచరులేనని అన్నారు. మంత్రి సబితారెడ్డి, కేఎల్ఆర్‌లు వలస వచ్చారన్నారు. స్థానికుడినైనా తనను ఆదరించి కమలం పువ్వు గుర్తుకే ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు శంకర్‌రెడ్డి, కార్పొరేటర్లు రామిడి మాధురి, పద్మ, జంగయ్యయాదవ్, స్థానికులు పాల్గొన్నారు.

బీజేపీలోకి పలువురు చేరిక

కందుకూరు: మండల పరిధిలోని లేమూరు, కటికపల్లి, ఆకులమైలారం గ్రామాల నుంచి బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి అందెల శ్రీరాములుయాదవ్ సమక్షంలో పార్టీలో చేరారు. వారికి ఆయన కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

సరూర్‌నగర్‌లో బీజేపీ ఇంటింటి ప్రచారం



ఓటు అభ్యర్థిస్తున్న శ్రీరాములు కుమార్తె

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ డివిజన్ వెంకటేశ్వర కాలనీలో మహేశ్వరం బీజేపీ అభ్యర్థి అందెల శ్రీరాములు గెలుపు కోసం ఆయన కుమార్తెతో కలిసి శనివారం కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి ఎన్నికల ప్రచారం చేపట్టారు. బ్యాండ్ బాజాతో ఇంటింటికి తిరిగి కమలం పువ్వుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.

సీఎం కేసీఆర్‌తోనే రాష్ట్ర అభివృద్ధి

- బీఆర్ఎస్ చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి



యువ సమ్మేళనంలో మాట్లాడుతున్న కార్తీక్‌రెడ్డి

శంకర్‌పల్లి: సీఎం కేసీఆర్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని బీఆర్ఎస్ చేవెళ్ల నియోజకవర్గం ఎన్నికల ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి కాలె యాదయ్యకు మద్దతుగా శంకర్‌పల్లి మండల, మున్సిపల్ బీఆర్ఎస్ యువజన విభాగాల ఆధ్వర్యంలో యువ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. పార్టీలకు అతీతంగా ప్రతీ ఇంటికి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే చేవెళ్ల నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. అనంతరం ఎమ్మెల్యే అభ్యర్థి కాలె యాదయ్య మాట్లాడుతూ నియోజకవర్గం అభివృద్ధికి తను నిరంతరం కృషి చేస్తున్నట్లు చెప్పారు. సీఎం కేసీఆర్ చేవెళ్ల నియోజకవర్గానికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేశారన్నారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను బూత్ స్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో శంకర్‌పల్లి ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ గోవిందమ్మ, చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మీ, వైస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, మున్సిపల్ యువజన విభాగం అధ్యక్షుడు పాండు రంగారెడ్డి, మండల యువజన విభాగం అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, ఏఎంసీ చైర్మన్ పాపారావు, వైస్ చైర్మన కురుమ వెంకటేశ్, పీఏసీఎస్ చైర్మన్ బద్దం శశిధర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు గోపాల్, మున్సిపల్ అధ్యక్షుడు వాపేదేవ్‌ఖన్నా, గోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీది పీపుల్స్ మేనిఫెస్టో

ఎల్బీనగర్ అభ్యర్థి మధుయాష్కీ గౌడ్

వనస్థలిపురం: కాంగ్రెస్ పార్టీది పీపుల్స్ మేనిఫెస్టో అని, ప్రజల సమస్యలను మేనిఫెస్టోలో పెట్టి వాటిని పరిష్కరించడమే తన ధ్యేయమని ఆ పార్టీ ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే అభ్యర్థి మధుయాష్కీ గౌడ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఉదయం బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ ఎన్జీవోస్ కాలనీలోని వివేకానంద పార్క్‌లో వాకర్స్‌ను కలిసి వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం వైదేహినగర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో, బీఎన్‌రెడ్డినగర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో కాలనీవాసులను కలిసి వారి సమస్యలు తెలుసుకున్నారు. హస్తం గుర్తుపై ఓటేసి తనను గెలిపించాలని ఆయన కాలనీవాసులను కోరారు. కార్యక్రమంలో నాయకులు జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, వజీర్ ప్రకాష్‌గౌడ్, మకుటం సదాశివుడు, కాలనీల సంక్షేమ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్న ముగ్గురు యువకుల బైండోవర్

హస్తినాపురం: నంబర్ ప్లేట్లు లేని వాహనాలపై ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ తిరుగుతున్న ముగ్గురు యువకులను వనస్థలిపురం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వనస్థలిపురం సీఐ దేవ జలేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా ఓంకార్‌నగర్ మల్లికార్జున నగర్‌కాలనీకి చెందిన బొడిగ మహేశ్ (19), కేశవోని కిరన్ (19), రంగారెడ్డి జిల్లా కర్మన్‌ఘాట్, బైరామల్‌గూడకు చెందిన తుమ్మల శివ(19)లు నంబర్ ప్లేట్లు లేని వాహనాలపై నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తూ వెళ్తుండగా గమనించిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. ముగ్గురినీ హయత్‌నగర్ మండల తహసీల్దార్ ముందు బైండోవర్ చేశామని సీఐ జలేందర్ రెడ్డి తెలిపారు.

దీపావళి సందడి

కందుకూరు: దీపావళి పండుగను పురస్కరించుకుని టపాసులు, దీపాలు, పూలు కొనుగోలుదారులతో దుకాణాలు సందడిగా మారాయి. మండల కేంద్రంలో శనివారం చిరు వ్యాపారులు ప్రత్యేకంగా దుకాణాలు ఏర్పాటు చేసి అందులో టపాసులు, దీపాలు, పూలు అమ్మకాలు చేపట్టారు. దీంతో కొనుగోలుదారులతో ఆ దుకాణాలు కిటకిటలాడాయి.

బీఆర్ఎస్ నేతలను అడ్డుకున్న తండావాసులు



నాయకులతో యువకుల వాగ్వాదం

ఆమనగల్లు: మండలంలోని దయ్యాలబోడు తండాలో శనివారం బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్న నాయకులను తండా యువకులు అడ్డుకున్నారు. మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు అర్జున్‌రావ్, వైస్ ఎంపీపీ అనంతరెడ్డి, శంకరకొండ తండా ఉపసర్పంచ్ ప్రశాంత్‌నాయక్ తదితరులు ప్రచారానికి వెళ్లారు. ప్రచారం నిర్వహిస్తుండగా నేతలను కొందరు యువకులు అడ్డుకున్నారు. తమ ప్రాంతాన్ని అభివృద్ధి చేయలేదని, ఎన్నికల సమయంలో మాత్రం నాయకులు వచ్చి పోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మేడిగడ్డ, శంకరకొండ తండా మధ్య వంతెన నిర్మాణం ఎందుకు చేపట్టడం లేదని ప్రశ్నించారు.

ఆలయ భూమిపై ఆరోపణలు మానుకోవాలి

- అభివృద్ధిని చూసి ఓటేయండి
- ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి

యాచారం: నందివనపర్తి ఓంకారేశ్వరాలయ భూమిపై తప్పుడు ప్రచారాలు మానుకోవాలని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి హెచ్చరించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం రాత్రి మండలంలోని నక్కిర్కెసింగారం గ్రామంలో రోడ్ షోలో ఆయన మాట్లాడుతూ.. కొందరు తనపై ఓంకారేశ్వరాలయ భూములు లాక్కుంటున్నారని, టీఎస్ఐఐసీకి ఇచ్చేస్తున్నారని ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఈ భూములపై కోర్టుకు వెళ్లింది ఎవరని ప్రశ్నించారు. భూములను సాగు చేస్తున్న కౌలు రైతులకు న్యాయం చేస్తానన్నారు. దేవాదాయ శాఖ అధికారులు ఆలయ భూముల సర్వేకు వస్తే నిలిపేసింది తానేనన్నారు. తను ఎవరికీ అన్యాయం చేసే వ్యక్తిని కాదన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని గుర్తించి కారు గుర్తుకు ఓటేసి మరోసారి అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు చిన్నోళ్ల జంగమ్మ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి భాషా, గ్రామ సర్పంచ్ వన్నెవాడ అరుణమ్మ, ఉప సర్పంచ్ వరప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపటి తరానికి కథలు అవసరం



బహుమతులు అందచేస్తున్న నిర్వాహకులు

బడంగ్‌పేట్: వాగ్దేవి ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులకు జానపద కథలు, జంతు కథలు, ఫెయిరీ టెల్స్, భారతీయ ప్రాంతీయ జానపద కథలు, కథనాలపై విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 34 పాఠశాలల నుంచి విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని తమ చతురతలను ప్రదర్శించారు. ముఖ్యఅతిథిగా యూట్యూబర్ అత్తగా అందరికి పరిచయమైన సీఎస్.రాధ, ఏవీఎస్ గ్రూప్ చైర్మన్ అలేఖ్య ప్రతాప్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కథలు చెప్పడం అనేది ఊహా, జ్ఞానాన్ని ఒకదానితో ఒకటి అల్లిన దారమన్నారు. కథలు చరిత్ర, జ్ఞానం, ఆ కాలం నాటి ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక జీవన విధానాన్ని తెలియజేస్తాయన్నారు. ఓపిక చేసుకుని కథలు వినడం, చదవడం నేర్చుకోవాలని అన్నారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందచేశారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ స్మిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విశ్వరూప సభకు తరలిన నాయకులు



అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న యాదగిరి

పహాడీషరీఫ్: మాదిగల విశ్వరూప మహాసభకు జల్‌పల్లి మున్సిపాలిటీ కౌన్సిలర్ బుడుమాల యాదగిరి ఆధ్వర్యంలో శనివారం ఎమ్మార్పీఎస్ నాయకులు తరలివెళ్లారు. అంతకుముందు గ్రామంలోని అంబేడ్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ.. మాదిగల న్యాయం జరిగేందుకు మందకృష్ణ ఏళ్ల తరబడిగా అలుపెరగని పోరాటం చేస్తున్నారన్నారు. మోడీ మాదిగలకు న్యాయం చేసేందుకు నిర్ణయం తీసుకోవడం సంతోషకరమన్నారు.

ఎక్సైజ్ పోలీసుల దాడులు..

- భారీగా పటిక, నల్లబెల్లం స్వాధీనం
- ఒకరి అరెస్టు



స్వాధీనం చేసుకున్న నల్లబెల్లం

మలక్‌పేట: అక్రమంగా పటిక, నల్ల బెల్లం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసిన ఘటన మలక్‌పేట ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ గోపాల్ తెలిపిన వివరాలు.. చంపాపేట భానునగర్‌కు చెందిన బి. రమేష్(46) సింగరేణి కాలనీలో కిరాణా దుకాణం నడుపుతున్నాడు. ఇతను సారా తయారీలో వాడే పటిక, నల్ల బెల్లం విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ తమ సిబ్బందితో కలిసి రమేష్ దాడి చేసి 900 కిలోలు నల్ల బెల్లం, 800 పటిక స్వాధీనం చేసుకున్నారు. పటిక నల్ల బెల్లం విలువ రూ.3 లక్షలు ఉంటుందని తెలిపారు. తనిఖీల్లో ఎస్సైలు శివ చరణ్ రెడ్డి, అనీస్ ఉద్దీన్, సిబ్బంది శ్రీనివాస్, ప్రసాద్, శంకర్, సురేందర్, కవిత, పావని పాల్గొన్నారు.

మరోసారి అవకాశమివ్వండి

- ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా
- ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



తారమతిపేట గ్రామస్తులతో కిషన్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యేగా మూడుసార్లు గెలిపించిన మీరే.. మరోసారి అవకాశం కల్పించాలని బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ప్రజలను అభ్యర్థించారు. ఆయన శనివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని గున్నలేటి, చిన్నరావిరాల, బండరావిరాల, సద్దుపల్లి, కవాడిపల్లి, అబ్దుల్లాపూర్‌మెట్, జేఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి వరకూ రూ.2930 కోట్లతో ఇబ్రహీంపట్నాన్ని అభివృద్ధి చేశానన్నారు. మరోసారి అవకాశం కల్పిస్తే జిల్లాలోనే ఆదర్శ నియోజకవర్గంగా రూపొందిస్తానన్నారు. తారమతిపేట గ్రామానికి చెందిన పలువురు మంచిరెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ విఠల్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కొత్త కిషన్‌గౌడ్, సర్పంచులు వనజ, సుజాత, కిరణ్‌గౌడ్, ఎంపీటీసీలు అనిత పాల్గొన్నారు.

నేడు మంచాలలో కిషన్‌రెడ్డి ప్రచారం

మంచాల: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ప్రచారం నిర్వహిస్తారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చీరాల రమేష్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని నోముల, లింగంపల్లి, తాళ్లపల్లిగూడ, తిప్పాయిగూడ, చిత్తాపూర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం కొనసాగుతుందన్నారు. మండలంలోని నాయకులు, హాజరు కావాలని కోరారు.

విద్యార్థులకు కరాటే శిక్షణ తరగతులు



శిక్షణ ఇస్తున్న మాస్టర్ సోను

ఆమనగల్లు: మండలంలోని మాలెపల్లిలో విద్యార్థులకు ఉచిత శిక్షణ తరగతులు శనివారం ప్రారంభమయ్యాయి. మాజీ సర్పంచ్ వెంకటరమణారెడ్డి, స్థానిక నాయకులు రవికుమార్‌ల సహకారంతో కరాటే మాస్టర్ సోను విద్యార్థులకు కరాటేలో శిక్షణ ఇస్తారు. కార్యక్రమంలో రాములు, లక్ష్మయ్య, రామస్వామి, వెంకటేశ్, మహేశ్, మల్లేశ్, శ్రీను, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు వేయాలి



లింగంపల్లిలో కవాతు చేస్తున్న పోలీసులు

మంచాల: మండల పరిధిలోని పలు గ్రామాల్లో పోలీసుల కవాత్ నిర్వహించారు. శనివారం మంచాల సీఐ కాశీ విశ్వనాథ్ ఆధ్వర్యంలో నోముల, లింగంపల్లి, చిత్తాపూర్, తాళ్లపల్లిగూడ గ్రామాల్లో పారా మిలటరీ బలగాలు ప్రదర్శన చేశాయి. సీఐ మాట్లాడుతూ.. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించుకోవాలన్నారు. ప్రజలు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.

కొనసాగుతున్న తనిఖీలు

కందుకూరు: అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా నగదు, మద్యం తరలించకుండా పోలీసులు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి పగడ్బందీ చర్యలు చేపట్టారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి మండల కేంద్రం శ్రీశైలం రహదారిపై అమ్ములు దాబా సమీపంలో స్థానిక పీఎస్ ఆధ్వర్యంలో చెక్‌పోస్టు ఏర్పాటు చేసి వాహనాల తనిఖీలు కొనసాగిస్తున్నారు.



శ్రీశైలం రహదారిపై కొనసాగుతున్న తనిఖీలు